
చదువుకు దూరంగా పల్లె

- బడి లేక ఆటలతో చిన్నారుల కాలక్షేపం
- పట్టించుకోని పాలకులు, ప్రభుత్వాలు
- ఆందోళనలో తల్లిదండ్రులు



ఆటలు ఆడుతున్న చిన్నారులు



పాలవాగు గ్రామం

సిరికొండ: ప్రస్తుత కంప్యూటర్ ప్రపంచంలో కూడా చదువుకు దూరంగా ఉంటున్నారు. ఈ పోటీ ప్రపంచంలో విద్య లేకపోతే తమకు విలువ లేదని తెలిక.. చిన్నారుల భవిష్యత్ ఆదిలోనే బుగ్గిపాలు అవుతోంది. సిరికొండ మండలంలోని పాలవాగులో పాఠశాల లేక చిన్నారులు చదువుకు దూరమవుతున్నారు. దీంతో రోజంతా ఆటలతో కాలక్షేపం చేస్తున్నారు.

బడిబాట పట్టని బాల్యం..

మండలంలోని కుంటగూడ పరిధిలోని పాలవాగు గ్రామంలో 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరందరూ వ్యవసాయంపై ఆధారపడి కాలం వెళ్లదీస్తున్నారు. తమలా పిల్లల భవిష్యత్ నాశనం కాకుండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో 25 నుంచి 30 వరకు పిల్లలు ఉన్నారు. కనీసం వారికి బడి అంటే కూడా తెలియదు. కుంటాగూడ పాఠశాలకు వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు నడుకుంటూ వెళ్లాలిన. ఆ దారిలో వాగు ఉంది. దీంతో ఇంటి వద్దే ఆటలు ఆడుకుంటూ.. పిల్లలు కాలక్షేపం చేస్తున్నారు.

ఎస్సై చొరవతో..

గత 2018లో అప్పటి ఇచ్చోడ మండల ఎస్సై శంకర్‌నాయక్ వీరి పరిస్థితి చూసి సీఐ సతీష్ కుమార్ సహకారంతో గ్రామంలోని నిరుద్యోగి యాదవ్‌రావును వలంటీర్‌గా నియమించి బడిని ప్రారంభించారు. దీంతో పిల్లలు రోజు బడికి వెళ్లి చదువుకున్నారు. ఐటీడీఏ అధికారులు వీరి పరిస్థితిని తెలుసుకొని ఆ వలంటీర్‌కు నెలకు రూ. 5వేలు జీతం ఇచ్చారు. కరోనా సమయంలో గ్రామంలోని బడి మూత పడింది. దీంతో లాక్‌డౌన్ తర్వాత వలంటీర్ నాలుగు నెలలు చదువులు చెప్పినా.. గౌరవ వేతనం రాకపోవడంతో మానేశాడు.

యువసేన ద్వారా బడి ప్రారంభించినా..

మండల కేంద్రానికి చెందిన యువసేన యూత్ సభ్యులు గత సంవత్సరం స్వచ్ఛందంగా గ్రామానికి చెందిన ఓ యువకుడిని వలంటీర్‌గా నియమించి బడిని ప్రారంభించారు. దీంతో గ్రామంలోని పిల్లలు ఎంతో కొంత చదువు నేర్చుకున్నారు. ఈ ఏడాది వలంటీర్ మానేయడంతో మళ్లీ పాలవాగు పిల్లల భవిష్యత్‌కు మొదటికి వచ్చింది. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేసి, చిన్నారులకు చదువు చెప్పించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పిల్లల జీవితాలు ఆగం



మేము బతికినట్లు, కష్టపడినట్లు మా పిల్లలు పడకూడదు. గ్రామంలో బడి లేక మా పిల్లల జీవితాలు ఆగం అవుతున్నాయి. అప్పటి ఎస్సై శంకర్‌నాయక్ దయతో చిన్న బడి ఏర్పాటు చేశాడు. దాన్ని ముందుకు తీసుకెళ్లే నాథుడు లేక చిన్నారులు భవిష్యత్ నాశనం అవుతుంది.

– పెందూర్ భీంరావు, పాలవాగు

ప్రభుత్వం స్పందించాలి



సిరికొండ యువసేన ఆధ్వర్యంలో పిల్లలకు విద్య నేర్పడం కోసం గౌరవంగా వేతనం ఇస్తూ.. పాఠశాలను ఏర్పాటు చేశారు. కానీ మా ఇంట్లో ఎవరూ లేక పొలం పనులు చేసుకుంటున్నాను. దీంతో పాఠశాల మూత పడింది. ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.

– యాదవ్‌రావు, వలంటీర్, పాలవాగు

'కాంగ్రెస్‌ను చీల్చేందుకు జోగు రామన్న కుట్ర'



మాట్లాడుతున్న కంది శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పార్టీని చీల్చేందుకు మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న కుట్రలు చేస్తున్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్‌లో పార్టీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాను దేశంలో లేని సమయంలో కొంత మందిని వెనుకేసుకుని ఓవ్యక్తి నాయకుడిలా చెలామణి అయ్యేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. వెనుకుండి వెన్నుపోటు పొడిచే నాయకులు పార్టీలో కొందరున్నారని, అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. జోగు రామన్న వెనుకుండి ఈ నాటకం ఆడిస్తున్నారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సమయంలో కుట్రకు తెరలేపారని పార్టీలోని కొంతమందిని పావులా వాడుకుంటున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా అధైర్యపడకుండా పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగిరేలా పార్టీ శ్రేణులు బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ కులస్తులు గత కొన్నేళ్ల నుంచి అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నేతలు పూసం ఆనంద్‌రావ్, కుర్సెంగే తానాజీ, మెస్రం కృష్ణలు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గోండి ధర్మగురు హీరా సుక మందిరం ఆవరణలో మాట్లాడారు. ఆదివాసీ పర్ధాన్ కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నారు. ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. నాన్ ఏజెన్సీ ప్రాంతాంలో నివాసం ఉంటున్న ఆదివాసీ పర్ధాన్ కులస్తులకు ఏజెన్సీ వారికి అమలు చేస్తున్న పథకాలను వర్తింప చేయాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఐటీడీఏ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులు మడావి శంకర్, గేడం మాధవ్, సెడ్మకి సుభాష్, గేడం జనార్దన్, కుడ్మేత ప్రకాష్, గంగాదేవి, సుహాసిని రెడ్డి, నారాయణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని స్ఫూర్తితో ముందుకు సాగాలి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్‌టౌన్: స్వామి వివేకానందుడిని స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మహాలక్ష్మివాడలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా పోటీ చేసి మూడుసార్లు ఓడిపోయినప్పటికీ ధైర్యాన్ని కోల్పోకుండా నాలుగోసారి విజయం సాధించినట్లు తెలిపారు. స్వామి వివేకానంద చూపిన బాటలో పయనించాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు భూమన్న, ప్రధాన కార్యదర్శి కోరెడ్డి లెనిన్, హన్మాండ్లు, శ్రీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిల్లి కిషన్, విజయ్, కేషవ్, హరిచరణ్, వీణ, వైభవ్, రాము, బజరంగ్ అగర్వాల్ పాల్గొన్నారు.

మాలలకు ఎంపీ సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న శాంతపురం రాజేశ్వర్

ఇచ్చోడ: కాంగ్రెస్ మాలలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని మాల సంక్షేమ సంఘం నాయకులు శాంతపురం రాజేశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల లో పెద్దపెల్లి, నాగర్‌కర్నూల్ ఎంపీ సీట్లను మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. జాతీయ కమిషన్ ఉండగా దాన్ని పట్టించుకోకుండా ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కార్యదర్శుల కమిటీని ఏర్పాటు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాలలను అవమానించే విధంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సమావేశం లో మాల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



పరీక్ష సామగ్రి అందజేస్తున్న సభ్యులు

ఇచ్చోడ: విద్యార్థులు ఇష్టపడి చదవాలని ముత్యాలిబాయి హమ్ముునాయక్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు గంగారాం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణరెడ్డి, ఉపాధ్యాయులు అశ్విని, కవిత, శ్యాంసుందర్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రిని శుక్రవారం అందజేశారు. కప్పర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న విలాస్‌గౌడ్, కృష్ణ కుమారి దంపతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్, ఉపాధ్యాయులు ప్రీతం, శిల్ప, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు కళాశాలల్లో చేరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులు చేరాలని ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కళాశాలలో తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ లెక్చరర్ల సంఘం ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల ప్రవేశ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సర్కారు డిగ్రీ కళాశాలను ప్రైవేటుకు ధీటుగా నడిపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దయాకర్, నర్సింగ్‌రావు, విజయ్‌కుమార్, రమేశ్, సంతోష్ కుమార్, జాకీర్ హుస్సేన్, రఘునాథ్, జగ్‌రాం, ప్రతాప్ సింగ్, తిరుపతి, రాజ్‌కుమార్, జ్ఞానేశ్వర్, జ్యోత్స్న, అనిత పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ఆదిలాబాద్‌టౌన్: నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత ఒక ప్రకటనలో కోరారు. తమ కళాశాలలో ఈనెల 3న ఉదయం 10.30 గంటలకు ది టైమ్స్ ప్రో సహకారంతో యాక్సిస్, ఐసీఐసీఐ, ఎస్‌బ్యాంక్, యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లతో పాటు డెలివరీ అండ్ ఫ్లిప్‌కార్టు కంపెనీల వారు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.20 వేల వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. డిగ్రీ, బీటెక్‌లో 50 శాతం మార్కులు కలిగి ఉండి 27 సంవత్సరాల వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 81067 64653 సంప్రదించాలని కోరారు.

సభ విజయవంతం చేయండి



జైనథ్: మాట్లాడుతున్న పాయల్ శంకర్



ఇంద్రవెల్లి: కార్యకర్తలతో సమావేశమైన రాథోడ్ రమేశ్

జైనథ్: ఆదిలాబాద్‌లో నిర్వహించే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని నిరాలలో సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 43 ఏళ్ల తరువాత దేశప్రధాని ఆదిలాబాద్‌కు రావడం జరుగుతుందన్నారు. రూ. 700 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్‌పై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భోయర్ విజయ్, కట్కం రాందాస్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఈనెల 4న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని నిర్వహించే ప్రధాని నరేంద్రమోదీ సభకు భారీ సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. సభ విజయవంతం చేసేందుకు బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రజలను సభకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు.

ఇచ్చోడ: ప్రధాన మంత్రి మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల నుంచి కార్యకర్తలను, ప్రజలను తరలించాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, కదం బాబారావు, మాధవ్‌రావు అమ్టే, కొల్లూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బోథ్: ఈనెల 4న జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం కోరారు. శుక్రవారం మండల కేంద్రానికి వచ్చిన ఆయన విలేకరుతో మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుభాష్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్‌రెడ్డి, వెంకటేశ్, భోజన్న, రవీందర్, భోజన్న, సూర్యం, వైస్ ఎంపీపీ లింబాజీ, నాయకులు పాల్గొన్నారు.

'జిల్లా అభివృద్ధికి కేంద్రం చేసింది శూన్యం'



మాట్లాడుతున్న నాయకులు

ఎదులాపురం: మోదీ పాలనలో జిల్లాకు న్యాయం జరగలేదని, బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి సాధన సమితి నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జిల్లాను ఓటు బ్యాంకుగా వాడుకుంటుందని ఆరోపించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకు వచ్చిన అమిత్ షా సిమెంట్ ఫ్యాక్టరీ వెంటనే తెరిపిస్తామని హామీ ఇచ్చారని, ఇంత వరకు ఎలాంటి చర్య తీసుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అడుగడుగునా జిల్లాకు అన్యాయమే చేసిందన్నారు. జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో జిల్లాకు రానున్న ప్రధాని నరేంద్ర మోదీ జిల్లా అభివృద్ధికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి సాధన సమితి నాయకులు బండి దత్తాత్రి, రోకండ్ల రమేశ్, ముడుపు ప్రభాకర్‌రెడ్డి, దర్శనాల మల్లేశ్, అరుణ్‌కుమార్, రాహుల్, సచిన్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సిరికొండ: మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ విజయ్ కుమార్ చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు కోట్నాక్ పుష్పలత ఆధ్వర్యంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

జైనథ్: మండలంలోని మాంగుర్ల గ్రామానికి చెందిన విద్యార్థుల కుటుంబాలను ఏబీసీ సభ్యులు నరేశ్‌జాదవ్ పరామర్శించారు. పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోలేక మనస్థాపంతో సాత్నాలలో దూకి ఆత్మహత్య చేసుకున్న టేకం శివకుమార్ కుటుంబ సభ్యులను కలిసి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అదే గ్రామానికి విద్యార్థిని చెందిన టేకం మహేశ్వరీ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుటుంబసభ్యులను సైతం పరామర్శించారు.

భూమిపూజ

తలమడుగు: మండలంలోని ఉండం గ్రామంలో గ్రామస్తులు దాతల సహకారంతో నిర్మిస్తున్న మహాలక్ష్మి దేవాలయానికి జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తుల ఐక్యతతో దాతల సహకారంతో గ్రామంలో పురాతన మహాలక్ష్మి మందిర స్థలంలో నూతన మందిరం నిర్మించడం అభినందనీయమన్నారు. ఎంపీటీసీలు రమేశ్‌రెడ్డి, వెంకన్న యాదవ్, రామచందర్ దేశ్‌ముఖ్, రఫీ, మహేందర్, లక్ష్మణ్, జగదీష్ పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధి



భూమిపూజ చేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: పార్టీలకతీతంగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని తేజాపూర్ గ్రామంలో రూ.20 లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామాల అభివృద్ధికి అందరు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆడే వసంత్, బోథ్ బ్లాక్ ప్రెసిడెంట్ అల్లూరి ప్రఫుల్ చందర్ రెడ్డి, బద్దం పోతారెడ్డి, ఏలేటి రాజు రెడ్డి, ముత్యాల పోతన్న, నాని రెడ్డి, ప్రతాప్ రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

బోథ్: మండల కేంద్రంలోని ఆరో వార్డులో జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో రూ. 8 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, పీఏసీఎస్ డైరెక్టర్ ఉమేష్, బొడ్డు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ప్రశాంత్, మచ్చేందర్, మహిపాల్, తుకారాం, రాజ్‌కుమార్, శ్రీనివాస్, ఇమ్రాన్, ముబీన్, బాబుసింగ్, రాములు, మేడిపల్లి శంకర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: బేల మండలంలోని సిర్సన్న గ్రామంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను కూల్చివేసి ఇల్లు కట్టుకున్న బీఆర్‌ఎస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి కోరారు. శుక్రవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై గతంలో కలెక్టర్, ఆర్టీసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. నాయకులు శ్రీకాంత్ రెడ్డి, మల్లేష్, ఆనంద్ రావు, శేఖర్, దామోదర్ రెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఎన్నికల్లో ప్రధానమైన ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కలెక్టరేట్‌లో ప్రత్యేక అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈవీఎం యంత్రాల ద్వారా ఓటుహక్కును ఎలా వినియోగించుకోవాలనే దానిపై కలెక్టరేట్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్‌తో పాటు పోలీస్ కానిస్టేబుల్‌ను ప్రత్యేకంగా నియమించారు.

క్లుప్తంగా

పంచాయతీ రాజ్ డీఈగా లింగన్న

ఇచ్చోడ: పంచాయతీ రాజ్ డీఈగా జాడి లింగన్న శుక్రవారం డీఈ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన డీఈ శైలెందర్ ఎస్సీగా పదోన్నతిపై వెళ్లారు. దీంతో జాడి లింగన్న డీఈగా ఇచ్చోడకు బదిలీపై వచ్చారు. ఆయనను స్థానిక ఏఈ అభినవ్, డీఈ కార్యాలయం సిబ్బంది శాలువాతో సత్కరించారు.

ఏపీవోగా బాధ్యతలు స్వీకరణ

సిరికొండ: మండల ఏపీవోగా భీంరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ఏపీవోగా విధులు నిర్వర్తిస్తున్న శేషరావు స్థానంలో భీంరావు బాధ్యతలు స్వీకరించారు. ఉపాధిహామీ పథకంలో సక్రమంగా పనులు జరిగేలా చేస్తానని అన్నారు.

'మాలీల ఎస్టీ హోదాపై ప్రధాని స్పందించాలి'

ఆదిలాబాద్‌రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 4న జిల్లా కేంద్రానికి రానున్న సందర్భంగా మాలీల ఎస్టీ హోదా బిల్లుపై స్పందించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మాట్లాడారు. మాలీలు గత 23 సంవత్సరాలుగా ఆంధ్రలో ఎస్టీలుగా ఉండి, తెలంగాణలో బీసీలుగా ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మాలీలకు ఎస్టీ హోదా కావాలని అనేక పోరాటాలు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరి 10న అసెంబ్లీలో తీర్మానం చేసి, ఆమోదం కోసం కేంద్రానికి పంపడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ అంశం పెండింగ్‌లో ఉందన్నారు. మాలీ కులస్తులకు ఎస్టీ హోదా కల్పించి సామాజిక న్యాయం అందించేలా బీజేపీ ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

తలమడుగు: పదో తరగతి పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జీసీడీవో మెస్రం ఛాయ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉమ్రీ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు ఇప్పటి నుంచే పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. పరీక్షలు అంటే భయం వీడాలని సూచించారు. సిలబస్ ఎంత వరకు పూర్తయిందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం సరస్వతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయండి

తలమడుగు: మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో శేఖర్, వైద్య అధికారి హరీష్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం అయ్యారు. 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్యాణ లక్ష్మి రాజేశ్వర్, ఎంపీడీవో శేఖర్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన ఎంపీడీవోలు

కైలాస్‌నగర్: జిల్లాలో ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, ఇంద్రవెల్లి, జైనథ్, భీంపూర్, తలమడుగు మండలాల ఎంపీడీవోలు జిల్లా పరిషత్ చైర్మన్ జనార్దన్ రాథోడ్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పరిషత్ కార్యాయంలోని తన ఛాంబర్‌లో కలిసి సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు.

మహిళలు హక్కులు తెలుసుకోవాలి

తాంసి: మహిళలు హక్కులను పూర్తిస్థాయిలో తెలుసుకున్నప్పుడే సమాజంలో రాణించే అవకాశం ఉంటుందని ఎంఈవో శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకల్లో భాగంగా మహిళ హక్కులపై అవగాహన కల్పించారు. మహిళల ఉన్నతంగా ఎదిగేందుకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరితా రెడ్డి, భాగీర్థ, భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గత కొన్ని నెలలుగా బంద్ ఉన్న ఆధార్ కేంద్రాన్ని జిల్లా అధికారుల ఆదేశాలతో శుక్రవారం తిరిగి ప్రారంభించారు. ఆధార్ కేంద్రం లేక పోవడంతో ప్రజలు ఉట్నూర్, గుడిహత్నూర్ వెళ్లాల్సి వచ్చేది. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, మెస్రం లక్ష్మణ్ పాల్గొన్నారు.